## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

## డీ-మెర్జింగ్‌తో వాటాదారులకు లాభమే

టాటా మోటర్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



నూఢిల్లీ, మే 24: టాటా మోటర్స్‌ను విడగొట్టే ప్రతిపాదనతో దీర్ఘకాలికంగా వాటాదారులకు లాభం చేకూరనున్నదని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. కంపెనీ 80వ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టాటా మోటర్స్‌ను రెండు సంస్థలుగా విడగొట్టి కమర్షియల్ వాహనాలు, ప్యాసింజర్ వాహన విభాగాలుగా విడగొట్టి స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది రెండో అర్ధభాగం నాటికి టాటా మోటర్స్ రెండు సంస్థలుగా మారబోతున్నది. వ్యాపార వ్యూహాత్మకంలో భాగంగా పలు సంస్థలను విడగొట్టాలని నిర్ణయించినట్టు, దీంతో గ్రూపు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు వాటాదారులకు లబ్ధిచేకూరనున్నదని ఆయన వ్యాఖ్యానించారు.




# గిన్నిస్‌బుక్‌లో ఎల్ఐసీ

**24 గంటల్లో 5.88 లక్షల పాలసీల విక్రయంతో రికార్డు**

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో అరుదైన ఘనతను సాధించింది. కేవలం 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలను విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరుకు గుర్తుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న కంపెనీకి చెందిన 4,52,839 ఏజెంట్లు ఒక్కో పాలసీ చొప్పున 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలను విక్రయించడం ఇదే తొలిసారని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం రోజైన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకొని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్కో పాలసీ అయిన పూర్తి చేయాలన్న కంపెనీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను సాధించినట్లు వెల్లడించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.




# సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు

**ఈవీను విడుదల చేసిన చైనా సంస్థ షియోమీ**

న్యూఢిల్లీ, మే 24: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ షియోమీ మరో అడుగుముందుకేసింది. ఇప్పటికే తన తొలి మాడల్‌కు విశేష స్పందన లభిస్తున్న ప్రస్తుత తరుణంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైయూ7 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. టెస్లాకు చెందిన వై మాడల్‌కు పోటీగా ఈ కారును ప్రవేశపెట్టింది. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌యూ7 సెడాన్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ఈ నూతన కారు ప్రత్యేకతలు..**

- సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అత్యధిక మైలేజీ ఇచ్చే మూడో మాడల్ ఇదే కావడం విశేషం.
- 96.3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో తీర్చిదిద్దింది. కేవలం 3.23 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 253 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- ప్రో మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 770 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# ఎఫ్‌డీఐలు తిరోగమనం

**2024-25లో భారీగా తగ్గిన విదేశీ పెట్టుబడులు**



న్యూఢిల్లీ, మే 24: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోదీ సర్కార్ విఫలమవుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా తగ్గుముఖం పట్టిన ఎఫ్‌డీఐలు..గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి కేవలం 353 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన 10 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలతో పోలిస్తే 96.5 శాతం తగ్గాయని పేర్కొంది. అంతక్రితం ఏడాది రికార్డు స్థాయి ఎఫ్‌డీఐలను ఆకర్శించిన భారత్.. ఆ మరుసటి ఏడాదే భారీగా పడిపోవడం విశేషం. కానీ, విదేశాల్లో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా సంస్థలు 29 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అంతక్రితం ఏడాది పెట్టిన 17 బిలియన్ డాలర్ల కంటే ఇది 50 శాతానికి పైగా అధికం.

**విదేశీ పెట్టుబడిదారులు దూరం**

ప్రపంచ దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. దీంతో గడిచిన కొన్నేండ్లుగా భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు..గతేడాది పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేశారు. కానీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారు. ఇతర దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండంకెల స్థాయిలో రాబడిని పంచడమే ఇందుకు కారణం. మొత్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 13.7 శాతం పెరిగి 81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో సగం ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. 2023-24 సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు 49 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ అండ్ పార్టనర్స్ గ్రూపు, స్విగ్గీ, విశాల్ మెగా మార్ట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు అత్యధికంగా వచ్చాయి. అలాగే ఆల్టర్నెటివ్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ), ఈవై, పీఈ/వీసీ ల నుంచి 26.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. హ్యుందాయ్ మోటర్ ఇండియా తన వాటాను 100 శాతం నుంచి 82.5 శాతానికి తగ్గించుకోవడంతో రూ.27,870 కోట్ల నిధులు సమకూరగా, అలాగే స్విగ్గీ కూడా 2 బిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. వీటితోపాటు టెలికం దిగ్గజం సింగ్‌టెల్..భారతీ ఎయిర్‌టెల్‌లో తనకున్న వాటాను మొత్తం విక్రయించగా, అలాగే బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ)..ఐటీసీలో ఉన్న తన మొత్తం వాటాను విక్రయించింది. గతేడాది సెప్టెంబర్ నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విదేశీ కంపెనీలు..దేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి.

**తయారీ రంగానికి బ్రేక్‌లు**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో తయారీ రంగంతోపాటు ఆర్థిక సేవలు, ఎనర్జీ, కమ్యూనికేషన్ రంగాలు విఫలమయ్యాయి. గత కొన్నేండ్లుగా ఈ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చలేకపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. తయారీ, ఆర్థిక సేవలు, ఎనర్జీ, టెలికం రంగాల్లోకి ఎఫ్‌డీఐలు భారీగా తగ్గడం మొత్తం ఎఫ్‌డీఐలపై ప్రతికూల ప్రభావం చూపాయని సెంట్రల్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది.

## హైదరాబాద్‌లో యంత్రాల ఎగ్జిబిషన్

హైదరాబాద్, మే 24: దక్షిణాదిలో అతిపెద్ద బీ2బీ ఇండస్ట్రియల్ యంత్రాలు అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌కు మరోసారి హైదరాబాద్ వేదికైంది. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజినీరింగ్, మౌలిక రంగానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

**బ్రోక్‌ఫిల్డ్ భారీ పెట్టుబడులు**

న్యూఢిల్లీ, మే 24: అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్రోక్‌ఫిల్డ్..భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో తన ఆస్తులను 100 బిలియన్ డాలర్ల స్థాయిలో పెంచుకోవడానికి భారీగా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ భారత్‌లో 30 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు కలిగివున్నది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, రెన్యూవబుల్ ఎనర్జీ, ప్రైవేట్ ఈక్విటీల్లో తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ కలిగివున్నది.

# ఎఫ్ఐఐల 5 వేల కోట్లు వెనక్కి

**గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు**

న్యూఢిల్లీ, మే 24: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకేరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.



## ఎన్టీపీసీ రూ.33.50 డివిడెండ్

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,897.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,490.05 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.48,816.55 కోట్ల నుంచి రూ.51,085 కోట్లకు ఎగబాకింది. దీంట్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు రూ.49,352 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,90,862.45 కోట్ల ఆదాయంపై రూ.23,953.15 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.33.50 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. గతేడాది కొత్తగా 3,972మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో మొత్తం కెపాసిటీ 79,930 మెగావాట్లకు చేరుకున్నది.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి

మందమర్రి, మే 24 : ఈ ఏడాది నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సింగరేణి కార్పొరేట్ జీఎం(ఐఅండ్‌పీఎం) మధుసూదన్ ఏరియా అధికారులకు సూచించారు. మందమర్రి ఏరియాలో శనివారం ఆయన పర్యటించారు. కార్పొరేట్ జీఎంగా బాధ్యతలు చేపట్టి, మొదటిసారిగా ఏరియాకు వచ్చిన ఆయనను ఏరియా జీఎం కార్యాలయంలో అధికారులతో జీఎం దేవేందర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం విజయ ప్రసాద్, ఏరియా ఇంజినీర్ వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియా రక్షణాధికారి రవీందర్, డీజీఎం ప్రసాద్, సివిల్ ఎస్ఈ రాము తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిలో కార్పొరేట్ జీఎం మధుసూదన్‌కు సన్మానిస్తున్న జీఎం దేవేందర్



మందమర్రి : మాట్లాడుతున్న మందమర్రి ఏరియా జీఎం దేవేందర్



రెబ్బెన : గోలేటిలో సమీక్ష నిర్వహిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి

# వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మందమర్రి, మే 24 : రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మందమర్రి ఏరియా జీఎం జీ దేవేందర్ అధికారులకు సూచించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఏరియాలోని వివిధ విభాగాల అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సింగరేణి పాఠశాల మైదానంలో వేడుకలు నిర్వహించనున్నందున ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించేలా ఉండాలని తెలిపారు. వేడుకల్లో భాగంగా ఉదయం 7:20 గంటలకు రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో జాతీయ జెండా ఎగురవేయనున్నట్లు చెప్పారు. సూపర్ బజార్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం రామాలయం చౌరస్తాలోని అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్నటుల వివరించారు. అనంతరం ఉదయం 9 గంటలకు మందమర్రి జీఎం కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం సింగరేణి పాఠశాల మైదానంలో తెలంగాణ రుచులు తినుబండారాల స్టాళ్లు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఎస్కే గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా రక్షణాధికారి రవీందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం ఎండీ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, మే 24 : రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి ఏరియా అధికారులకు సూచించారు. గోలేటి జీఎం కార్యాలయంలో వేడుకల నిర్వహణపై ఏరియా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 2వ తేదిన నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన ఎజెండా, నిర్వహణ బాగుండాలని, అందుకు గోలేటిలోని భీమన్న క్రీడా మైదానం, జీఎం కార్యాలయాలను సుందరంగా తీర్చిదిద్దాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, డీజీఎం(స్టోర్స్) శ్రీనివాసరావు, డీజీఎం(వర్క్‌షాప్) కృష్ణమూర్తి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ సంఘం నాయకుల నిరసన

చెన్నూర్, మే 24 : సరస్వతీ పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరిచారని చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు నిరసన తెలిపారు. దళిత ఎంపీ అయిన వంశీకృష్ణను ఆహ్వానించకుండా, పొటో పెట్టకుండా అవమానపర్చిన మంత్రి శ్రీధర్‌బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రొటోకాల్ పాటించకుండా అవమానపర్చిన దేవాదాయశాఖ చీఫ్ సెక్రటరీని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, నాయకులు తగరం వెంకటి, జనాగామ తిరుపతి, దుర్గం వెంకటి, దాసరి కమలాకర్ పాల్గొన్నారు.

**జీతాలు చెల్లించాలి**

రెబ్బెన, మే 24 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సోమవారం వరకు జీతాలు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కాంట్రాక్టు కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శనివారం పర్యటించారు. బెల్ట్ క్లీనింగ్ కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. జీతాలు చెల్లించకపోతే జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్ట్ క్లీనింగ్ కార్మికులు పాల్గొన్నారు.

**సాగు ప్రణాళిక రూపొందించుకోవాలి**

మందమర్రి రూరల్, మే 24 : వాతావరణంలో వస్తున్న మార్పులను బట్టి పంట కాలంలో మార్పులను పాటించాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. మండలంలోని ఆదిల్‌పేటలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

# పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

నస్పూర్,మే 24 : ఈ నెల 25న జరగనున్న గ్రామపాలన అధికారుల రాత పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. హైదరాబాద్ నుంచి శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, లోటు పాట్లు లేకుండా పరీక్ష నిర్వహించాలన్నారు. ప్రశాంతంగా పరీక్ష జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంచిర్యాల నుంచి కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాల తరలింపు, స్ట్రాంగ్‌రూం, పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. వైద్య సిబ్బందిని నియమించి మందులు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో నిర్వహించే పరీక్షకు 155 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, తహసీల్దార్ రఫతుల్లా, విద్యాశాఖ పరిశీలకులు సత్యనారాయణ, ముఖ్య పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, మే 24 : శ్రీరాంపూర్ ఏరియాలోని రాయల్ టాకీస్ నుంచి ఎస్సార్పీ-1, 3 గనులకు వెళ్లే రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. అదే దారిలో ఇసుక బంకర్, గోదాములు ఉండడం వల్ల రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఉండి రోడ్డు కమ్ముకుంటుందని పేర్కొన్నారు. 2వ, 3వ బదిలీలకు రాత్రి వెళ్లి వచ్చే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీసీసీ నుంచి సంఘమయ్యపల్లి మీదుగా ఇదే గనికి వెళ్లే దారి కూడా ఇరుకుగా ఉండడం, లైటింగ్ లేకపోవడం వల్ల ఉద్యోగులు డ్యూటీకి వెళ్లి వచ్చే టైంలో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండి రమేశ్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేశ్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎండీ లాల, ముత్యాల రమేశ్, గోనె స్వామి పాల్గొన్నారు.

# ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ



కౌటాల : మాట్లాడుతున్న ఎంఈవో హన్మంతు

నస్పూర్, మే 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఐదు రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతు లు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, వని తా వాక్కు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అడ్వకేట్ రంగు వేణుకుమార్ పాల్గొని మాట్లాడారు. మాన వ అక్రమ రవాణా అంశంపై ట్రైనింగ్ సెషన్ నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు వేణుకుమార్‌ను ఘనంగా శాలువాలతో సన్మానించారు. సెంటర్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, నీలేశ్‌మాచల్, నాగోరావు, రమణయ్య, రంజిత, సుమన, చైతన్య, శ్రీదేవి పాల్గొన్నారు.

వేమనపల్లి, మే 24 : వేమనపల్లి పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు ముగిశాయి. ముగింపు తరగతులకు ఎంఈవో శ్రీధర్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్లను ఎంఈవో, ఉపాధ్యాయులు సన్మానించారు. రిసోర్స్ పర్సన్లు శంకర్, వినయ్‌కుమార్, సంతోష్, మహేందర్, శ్రీధర్, అనూష, శ్రీకాంత్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి, మే 24 : విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. డీఆర్పీలు బొలిశెట్టి బుచ్చన్న, లక్ష్మణాచారి, మండల రిసోర్స్ పర్సన్లు, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు ఉన్నారు.

కౌటాల, మే 24 : ఉపాధ్యాయులు మెలకువలు పాటించి విద్యా బోధన చేయాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. కౌటాల జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీ విషయాన్ని విద్యాభివృద్ధికి ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా నూతన పద్ధతుల ద్వారా విద్యా బోధన చేయడంతో విద్యార్థులకు విద్యపరంగా ఆసక్తి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకులుగా నాయికిని శ్రీనివాస్, ఎంర్పీలుగా తిరుపతి, సునీల్, శివాజీ, సాయి కిరణ్, రావుజి, సంజయ్ కుమార్, ప్రదీప్, రిటైర్డ్ ఉపాధాద్యాయుడు రాకేశ్ గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్, మే 24: కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ విజయవంతంగా ముగిసింది. కాగజ్‌నగర్ సీఐ ప్రేమ్ కూమార్, ఎస్ఐ సుధాకర్, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ హాజరయ్యారు. శిక్షణలో పొందిన జ్ఞానాన్ని తరగతి గదిలో అమలు చేయాలని ఉపాధ్యాయులకు గుర్తుచేశారు. శిక్షణ శిబిరం ద్వారా నూతన బోధనా పద్ధతులు, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రేరేపించే నైపుణ్యాలు అభ్యసించినట్లు పలువురు ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి : మాట్లాడుతున్న ఎంఈవో చిన్నయ్య



రెబ్బెన : సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ



నస్పూర్ : వేణుకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రెబ్బెన, మే 24 : సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని రెబ్బెన సీఐ బుద్దే స్వామి అన్నారు. రెబ్బెన జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో వెంకటేశ్వర్‌తో కలిసి ప్రభుత్వ ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై అప్రమత్తపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాంకిడి, మే 24 : సైబర్ మోసాగాళ్లు రోజురోజుకు కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల అనంతరం ఎస్ఐ హాజరై, మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు సైబర్ మోసగాళత్లో జాగ్రత్త ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.